సాక్షి నల్లగొండ

సోమవారం । 1 । జులై । 2024



బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

వరంగల్, మెదక్ జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశారు.

- 10లో



ముగిసిన నాటక ప్రదర్శన

యాదాద్రిలో నాలుగు రోజులుగా సాగుతున్న నాటక ప్రదర్శన ఆదివారం మాయా బజార్ నాటకంతో ముగిసింది.

- 10లో

గరిష్టం / కనిష్టం

33⁰ / 27⁰

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం నల్లగొండ రానున్నారు. బీట్ మార్కెట్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు. అనంతరం డీసీసీబీ జరిగే సమావేశంలో పాల్గొంటారు. మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మధ్యాహ్నం 3 గంటలకు గంధంవారిగూడెంలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి అక్కడ నుంచి తిరిగి హైదరాబాద్ వెళ్తారు.

రైతు భరోసాను జమ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

హాలియా : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై విధివిధానాలను ప్రకటించి రైతుల ఖాతాలో డబ్బులను వెంటనే జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హాలియాలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతు భరోసాను ఎకరాకు రూ.7500 ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పుడు డబ్బులు ఇవ్వని కారణంగా రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాసంపదైన బొగ్గు గనులను వేలం వేయడం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందన్నారు. బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జులై 8న నిడమనూరు మండల కేంద్రంలో నిర్వహించనున్న పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కున్‌రెడ్డి నాగిరెడ్డి, సీహెచ్.లక్ష్మీనారాయణ, కొండేటి శ్రీను, అవుతా సైదయ్య, దుబ్బ రామచంద్రయ్య, దైద శ్రీను, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వేములకొండ పుల్లయ్య, రవినాయక్, వెంకన్న తదితరులు ఉన్నారు.

భూ కుంభకోణంపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న కుంట్ల ధర్మార్జున్

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అనుచరుల భూ కుంభకోణంపై న్యాయ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఆ పార్టీ నాయకులు భూ ఆక్రమణకు పాల్పడ్డారని, కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని పట్టాలు చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై తాము మొదటి నుంచి ఆందోళనలు చేస్తున్నామని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సూర్యాపేట పట్టణంలోని సర్వే నంబర్ 817, 816, 818లో ఉన్న ఇనాం భూములను అసలైన లబ్ధిదారులకు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్, కార్యదర్శి బొడ్డు శంకర్, లీగల్ సెల్ జిల్లా కోఆర్డినేటర్ వీరేష్‌నాయక్, నాయకులు పాండుగౌడ్, దేవత్ సతీష్, ఫరీద్, మల్సూర్ పాల్గొన్నారు.

పత్తికి ప్రాణం



తిప్పర్తి వద్ద పత్తి చేను

- జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ముసురు
- వాడుపట్టే దశలో పత్తి చేలకు జీవం పోసిన వాన
- ఇప్పటి వరకు 2.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- ముసురుతగ్గితే చేలకు ఎరువులు పెట్టుకోనున్న రైతులు

నల్లగొండ అగ్రికల్చర్ : అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. భూమికి మంచి పదును ఇచ్చే వాన కావడంతో.. వాడుపట్టిన పత్తి చేలకు ప్రాణం పోసింది. ఈ సారి 6.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు 2.70 లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. చేలలో పత్తి విత్తనాలు మొలకెత్తిన నాటి నుంచి ఇప్పటి వరకు మంచి వాన కురవలేదు. ఆకులు వేసే స్థాయిలో చేలు వాడుపట్టే పరిస్థితి రావడంతో పంటను కాపాడుకునేందుకు అనేక ప్రాంతాల్లో రైతులు చేలకు నీరు పెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితిలో జిల్లా అంతటా వర్షం కురుస్తుండడంతో పత్తిచేలకు మంచి పదునైంది.

వర్షం తగ్గితే పత్తి చేలకు ఎరువులు

జిల్లా అంతటా కురుస్తున్న ముసురు తగ్గితే రైతులకు పత్తి చేలలో కలుపు తీసుకునే పనిలో నిమగ్నం కానున్నారు. ఆ తరువాత గుంటక తోలుకుని చేలకు డీఏపీ, కాంప్లెక్స్, యూరియా ఎరువులను పెట్టుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. దీంతో పాటు వరినార్లు పోసుకున్న రైతులు సైతం వరినాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలో 600 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. లక్ష ఎకరాలకు వరినార్లు పోసుకున్నారు. మంచి సమయంలో వర్షం కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

7.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో అన్ని మండలాల్లో ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలో 7.5 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మిర్యాలగూడ మండలంలో 26.7 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నాంపల్లి మండలంలో 0.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తిప్పర్తి మండలంలో 22.8 మిల్లీమీటర్లు, నిడమనూరు 15.9, త్రిపురారం 15.1, వేములపల్లి 12.0, దామరచర్ల 18.8, శాలిగౌరారం 10.6, కేతేపల్లి 10.1, మాడ్గులపల్లి 10.8, చిట్యాల 2.9, నార్కట్‌పల్లి 1.0, కట్టంగూర్ 2.1, నకిరేకల్ 2.5, నల్లగొండ 9.9, కనగల్ 1.9, మునుగోడు 8.6, చండూరు 5.1, మర్రిగూడ 3.4, చింతపల్లి 6.5, గుర్రంపోడు 1.2, అనుముల హాలియా 7.4, అడవిదేవులపల్లి 6.4, తిరుమలగిరి సాగర్ 2.6, పెద్దవూర 4.3, పెద్దఅడిశర్లపల్లి 8.2, నేరడుగొమ్ము 3.8, కొండమల్లేపల్లి 4.4, దేవరకొండ 3.3, గుండ్లపల్లి 2.2, చందంపేట 6.7, గట్టుప్పల్ మండలంలో 2.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

కలుపుతీసి ఎరువులు పెట్టాలి



పత్తి చేలకు మంచి పదునైన వర్షం పడుతోంది. వర్షం తగ్గగానే వెంటనే చేలలో కలుపు తీసుకుని ఎరువులు పెట్టుకుంటాం. వాడుపడుతున్న సమయంలో వర్షం రావడం వల్ల పత్తిచేలకు ప్రాణం వచ్చింది.

– వెంకన్న, రైతు, గుండ్లపల్లి, నల్లగొండ మండలం

నార్లు పోసుకున్న రైతులు పొలాలు దున్నుకోవాలి



అల్పపీడనం కారణంగా జిల్లా అంతగా మంచి పదునైన వర్షం కురుస్తోంది. పత్తిచేలు వాడుతున్న దశలో వర్షం రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంచి పదునైనందున చేలకు ఎరువులు పెట్టుకునేందుకు అనువుగా ఉంటుంది. నార్లు పోసుకున్న రైతులు పొలాలు దున్నుకునేందుకు అవకాశం ఉంటుంది.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

వెబ్ ఆప్షన్‌ల గందరగోళం

- బదిలీలకు ఒక్కరోజులో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలనే నిబంధన
- ఒక్కొక్కరు వందల సంఖ్యలో ఆప్షన్లు ఇవ్వాల్సి రావడంతో సరిపోని సమయం
- నష్టపోతామంటున్న ఎస్‌జీటీలు



ఓ ఎస్‌జీటీ నల్లగొండ మండలం పరిధిలోని ఓ పాఠశాలలో 8 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. ఇప్పుడు ఆయనకు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. జిల్లా కేంద్రం దగ్గర ఉండటంతో బదిలీల జాబితాలో ఆయనకు 1200 పైచిలుకు సీరియల్ నంబర్ ఉంది. బదిలీ కోసం ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవాలి. జిల్లా కేంద్రానికి దగ్గర ఉన్న పాఠశాలలను ఎంచుకుంటూ ఆయన సీరియల్ ప్రకారం 1200 ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి వచ్చింది. అందుకోసం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నెట్ సెంటర్‌లో తీవ్ర ఇబ్బందులు పడ్డాడు.

నల్లగొండ : ఉపాధ్యాయ బదిలీలకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడంలో ఎస్‌జీటీల్లో గందరగోళం నెలకొంది. బదిలీల విషయంలో సీనియారిటీ ప్రకారం ఉపాధ్యాయులు ఎన్నో సంఖ్యలో ఉంటే ఖాళీల ఆధారంగా బదిలీల కోసం అన్ని ఆప్షన్లు ఇవ్వాల్సి రావడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకొక్కరు వారి సీరియల్ ప్రకారం.. ఆయా మండలాల్లోని పాఠశాలల్లో ఉన్న ఎస్‌జీటీ ఖాళీల పోస్టులను చూసుకుని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. వందల సంఖ్యలో ప్రాంతాలను గుర్తించి ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇవ్వాలంటే దాదాపు 2, 3 గంటల సమయం పడుతోంది. మరోవైపు వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు ఒకేరోజు సమయం ఇవ్వడం.. ఓ వైపు వర్షం, మరోవైపు ఆదివారం నెట్ సెంటర్లు మూసి ఉండడంతో చాలా మంది ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇవ్వలేకపోయారు. దీంతో వారు సుదూర ప్రాంతాలకు బదిలీ అయ్యే అవకాశం ఉండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అప్రకటిత రేషనలైజేషన్..

ఏకోపాధ్యాయ పాఠశాలలను నడిపిస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు మాత్రం ఎస్‌జీటీల బదిలీల్లో పిల్లలులేని పాఠశాలలకు సంబంధించిన ఖాళీలను మాత్రం ఆన్‌లైన్‌లో చూపించలేదు. దీంతో ఉపాధ్యాయులు ఆ పాఠశాలలకు ఆప్షన్లు ఇవ్వలేకపోయారు. దీనిపై టీఎస్‌యూటీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాలు అప్రకటిత రేషనలైజేషన్ వల్ల ఎస్‌జీటీలు నష్టపోతున్నారని పేర్కొంటున్నాయి. ఒక పక్క పదోన్నతుల్లో నష్టపోయిన ఎస్‌జీటీలు ఇప్పుడు అప్రకటిత రేషనలైజేషన్ వల్ల నష్టపోతున్నామని ఎస్‌జీటీలు పేర్కొంటున్నారు. రాష్ట్ర విద్యా శాఖ అధికారులు బ్లాక్‌లో పెట్టిన ఖాళీలను ప్రకటించి వెబ్ ఆప్షన్ సమయం పొడిగించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

కేతేపల్లి : రైతు భరోసా పథకంపై కేతేపల్లి సహకార సంఘంలో ఆదివారం రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ రైతు భరోసాను రైతులకు ఏమేరకు ఇస్తే బాగుంటుందో తెలపాలన్నారు. రైతుల అభిప్రాయాలే ప్రామాణికంగా రైతు భరోసా అమలు చేస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎలాంటి సీలింగ్ విధించకుండా రైతులు సాగు చేసిన భూమి మొత్తానికి రైతు భరోసా ఇవ్వాలని కోరారు. సన్న, చిన్నకారు రైతులు సైతం తమ వ్యక్తిగత అవసరాల కోసం ఐటీ చెల్లిస్తున్నారని, ఐటీ ప్రాతిపదిన పెడితే చిన్న రైతులు సైతం రైతు భరోసాకు అనర్హులయ్యే అవకాశముందన్నారు. పది ఎకరాలు పరిమితం చేయాలని కొందరు రైతులు అభిప్రాయం వ్యక్తం చేయగా ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వ పింఛన్ పొందేవారు, గౌరవం వేతనం పొందే వారికి రైతు భరోసా అమలు చేయవద్దని మరికొందరు కోరారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇచ్చేలా చూడాలని పలువురు కోరారు. సమావేశంలో ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, పీఏసీఎస్ సీఈవో నర్సయ్య, ఏవో బి.పురుషోత్తం, ఏఈవోలు వీరేష్, బాలరాజు, ఉమేష్, రైతులు పాల్గొన్నారు.

డెంగీ విజృంభణ

- ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 38 కేసులు
- నల్లగొండ నియోజకవర్గంలోనే 20..
- దోమల వ్యాప్తితో కేసుల పెరుగుదల



నల్లగొండ టౌన్ : జిల్లాలో డెంగీ విజృంభిస్తోంది. వర్షాకాలం ఊపందుకోకముందే డెంగీ వ్యాప్తి పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జనవరి మాసం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 38 పాజిటివ్ కేసులు నమోదు కావడం డెంగీ వ్యాప్తి ఉధృతికి అద్దం పడుతోంది. నల్లగొండ నియోజకవర్గంలోనే అత్యధిక డెంగీ కేసులు నమోదయ్యాయి. మున్ముందు జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కేసుల నమోదు ఇలా..

తిప్పర్తి పీహెచ్‌సీ పరిధిలో 6, నల్లగొండ మండలం రాములబడ పరిధిలో 3, కనగల్ పరిధిలో 4, మాన్యంచెల్క అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 4, పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 3, చిట్యాల, నార్కట్‌పల్లి, శాలిగౌరారం, కేతేపల్లి, దామరచర్ల, నాగార్జునసాగర్, చందంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఒకటి చొప్పున, కట్టంగూర్, హాలియా పీహెచ్‌సీల పరిధిలో రెండు చొప్పున, నిడమనూరు పీహెచ్‌సీ పరిధిలో 4 డెంగీ కేసులు నమోదయ్యాయి.

మురుగునీటి నిల్వే కారణం..

వర్షాకాలంలో ఏర్పడే నీటి గుంతలతోపాటు మురుగు కాల్వలు, ఇళ్లలో పేరుకుపోయిన నీటి తొట్లు, పగిలిపోయిన కుండలు, డ్రమ్ముల్లో నీటి నిల్వ ఉండటం వల్ల దోమల వ్యాప్తి పెరిగి డెంగీ వ్యాప్తికి దోహద పడుతున్నాయి. నీటి నిల్వ లేకుండా చూసుకునేందుకు ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామాలు, పట్టణాల్లోని వీధులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వర్షాలకు ముందు, తర్వాత డ్రెయినేజీల్లో పూడిక తీసివేసి మురుగు సక్రమంగా పారే విధంగా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంది. వ్యాధిపై సరైన అవగాహన కలిగి ఉండడం. దోమల పెరుగుదల అరికట్టడానికి నీటి నిల్వలు తొలగించడం. వారంలో ఒక రోజు డ్రై డేగా పాటించి పేరుకుపోయిన నీటి నిల్వలను పారబోయడం చేయడం ద్వారా డెంగీని అరికట్టవచ్చు.

సిబ్బందిని అప్రమత్తం చేశాం



జిల్లాలో డెంగీ వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేశాం. అన్ని గ్రామాలు, పట్టణాల్లో మురుగునీటి గుంతల్లో దోమల నివారణకు మందులను స్ప్రే చేయాలని ఆదేశాలిచ్చాం. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. డెంగీ లక్షణాలు కనపడితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుడిని సంప్రదించాలి.

– డాక్టర్ కళ్యాణచక్రవర్తి, డీఎంహెచ్‌ఓ

పట్టించుకోని అర్బన్ మలేరియా విభాగం..

పట్టణాల్లో దోమలను నివారించడంతో పాటు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నివారణ కోసం అర్బన్ మలేరియా విభాగం పని చేయాల్సి ఉంటుంది. ఈ విభాగంలో ఒక్క నల్లగొండ పట్టణంలోనే 60 మంది వరకు సిబ్బంది ఉన్నారు. వీరు దోమల నివారణలో పూర్తిగా విఫలమయ్యారనే అపవాదు ఉంది. దోమల నియంత్రణకు మందులు చల్లడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

డెంగీ లక్షణాలు..

అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో కూడిన తీవ్ర జ్వరం, జ్వరం తగ్గినట్లే అనిపించి వారం, పది రోజుల్లో తిరిగి రావడం, డెంగీ వైరస్ వల్ల కలిగే లక్షణం. ఎడిస్ దోమ ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాధి వ్యాప్తి చెందుతుంది. కళ్ల నొప్పి, శరీరంపై చిన్న దద్దుర్లు, డెంగీ లక్షణాలు.

గిరిజనుల సంక్షేమమే సేవాలాల్ లక్ష్యం

కోదాడరూరల్: గిరిజన జాతి సంక్షేమమే సేవాలాల్ లక్ష్యమని సేవాలాల్ రాష్ట్ర కన్వీనర్ మాలోతు సైదానాయక్, కోకన్వీనర్లు బాణోతు హుస్సేన్ నాయక్, రాజేష్‌నాయక్ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సదస్సు, నూతన కమిటీ ఎన్నిక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మన తండాలలో మన రాజ్యం రావాలంటే సద్గురు సేవాలాల్ మహరాజ్ బాటలో పయనించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పూర్తి హక్కులు గిరిజనులే దక్కేలా ప్రభుత్వాలు చట్టాలు రూపొందించాలని కోరారు. ప్రతి గిరిజనబిడ్డ సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకోసం పనిచేయాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ధరావత్ రవీందర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా నాగునాయక్, ఉపాధ్యక్షుడిగా భూక్యా శోభన్, అధికార ప్రతినిధిగా గుగులోతు చందు నాయక్, కార్యదర్శిగా లూనావత్ రవీందర్, సహాయ కార్యదర్శిగా సక్రంతో పాటు సేవాలాల్ నియోజకవర్గ మీడియా అధ్యక్షుడు లావుడియా రమేష్‌నాయక్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో రాజేష్‌నాయక్, పద్మాబాయ్, బాలాజీనాయక్, బలరాం నాయక్, శ్రీనివాస్‌నాయక్, నాగునాయక్, రవినాయక్, జానునాయక్, రమేష్‌నాయక్, వస్రం నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ రంగంలో అపార అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమోహన్ రావు

బొమ్మలరామారం : హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో విద్యనభ్యసించిన విద్యార్థులకు రక్షణ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులా భరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్‌లో గల హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యతో పాటు క్రీడలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులు నిర్వహించడం హర్షించదగిన విషయమన్నారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తూ దేశానికి సేవ చేయడానికి సైనికులను అందజేస్తున్న డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాల సేవలు అభినందనీయమన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏగ్గే మల్లేశం, ఓయూ ప్రొఫెసర్ రాములు, అదనపు ఎస్పీ నర్సింహారావు, ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్, తాజామాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్, డైరెక్టర్ నవ్యశ్రీ, కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, చీఫ్ డాక్టర్ ఆర్.కె.రావు పాల్గొన్నారు.

ఆర్థిక బాధ్యతల్లో వద్దు

- రెవెన్యూ విధుల నుంచి ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు
- రెగ్యులర్ ఉద్యోగులకు అప్పగింత
- ఇతర విభాగాల్లోకి ఔట్ సోర్సింగ్ సిబ్బంది
- ఆర్థిక అవకతవకలు జరగకుండా మున్సిపల్‌శాఖ జాగ్రత్తలు



మున్సిపల్ కార్యాలయం

నల్లగొండ టూటౌన్ : మున్సిపల్ కార్యాలయాల్లో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఆ బాధ్యతల నుంచి తప్పించాలని డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) ఆదేశాలు జారీ చేసింది. ఈ విభాగంలో ముఖ్యమైన ఆస్తి పన్ను వసూలులో అవకతవకలకు పాల్పడితే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నుంచి రీకవరి సాధ్యం కాదనే విషయాన్ని పరిగణనలోని తీసుకున్నట్లు తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లాలోని ఓ మున్సిపాలిటీలో జరిగిన అక్రమాలతోనే మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది. రెవెన్యూ విభాగంతో పాటు ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అన్ని విభాగాల నుంచి వారిని తప్పించాలని మున్సిపల్ ఉన్నతాధికారులు ఇటీవల సర్క్యులర్ జారీ చేశారు. దీంతో వారి స్థానంలో రెగ్యులర్ ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగిస్తున్నారు.

జిల్లాలో 46 మంది..

జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, హాలియా, దేవరకొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపల్ కార్యాలయాల్లో రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న 46 ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తప్పించి ఇతర విభాగాల్లోకి పంపారు. ఆయా విభాగాల్లో గతంలోనే మున్సిపల్ కార్యాలయాలకు కేటాయించిన వీఆర్‌ఓలను ఆస్తి పన్ను వసూలు, భవనాలను మదింపు చేయడానికి ఇన్‌చార్జి బిల్ కలెక్టర్లుగా నియమించారు. రెగ్యులర్ సిబ్బంది అందుబాటులో లేని మున్సిపల్ కార్యాలయాల్లో వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించాలని డీఎంఏ అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఆర్థిక లావాదేవీలు జరిగే కార్యకలాపాలకు సంబంధించిన పనులు అప్పగించవద్దనే విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు.

తప్పించిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది..

నల్లగొండ	11
మిర్యాలగూడ	05
హాలియా	07
నకిరేకల్	04
దేవరకొండ	09
చిట్యాల	05
చండూరు	05
మొత్తం	46

సరిపడా లేని రెగ్యులర్ సిబ్బంది

జిల్లాలో 8 మున్సిపాలిటీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన నందికొండ మున్సిపాలిటీలో ఇప్పటి వరకు ఇంకా ఆస్తి పన్ను మదింపు చేపట్టలేదు. మిగతా ఏడు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూలు చేయడానికి, భవనాలు మదింపు చేయడానికి సిబ్బంది అవసరం ఉంటారు. కానీ కొన్ని మున్సిపల్ కార్యాలయాల్లో తగినంత మంది రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో ఔట్ సోర్సింగ్ సిబ్బందితోనే పని చేయించుకుంటున్నారు. హాలియా, చండూరు, నకిరేకల్ మున్సిపాలిటీల్లో సరిపడా రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సివస్తోంది. పెరుగుతున్న పట్టణ విస్తీర్ణం, భవనాల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగులను కూడా నియమించాల్సిన అవసరం ఉంది.

రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తప్పించి రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాం. వార్డు ఆఫీసర్లతో పాటు గతంలో వీఆర్వోలుగా వచ్చిన వారిని రెవెన్యూ విభాగంలో నియమించాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

ఆస్తి పన్నుపై ప్రభావం..

మున్సిపాలిటీలకు కీలక ఆదాయ వనరైన రెవెన్యూ విభాగంలో పూర్తి అవగాహన కలిగిన ఉద్యోగులు ఎంతో అవసరం. రెగ్యులర్ ఉద్యోగులు అయినా, ఔట్ సోర్సింగ్ సిబ్బంది అయినా ఆస్తి పన్ను మదించడం, వసూలు చేయడం వంటి వాటిపై అవగాహన లేకపోతే.. ఆదాయ వనరుపై ఎఫెక్ట్ పడే అవకాశం ఉంటుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. కొత్తగా రెవెన్యూ విభాగంలోకి తీసుకున్న వారికి అవగాహన కల్పిస్తేనే ఆస్తి పన్ను సకాలంలో వసూలు చేయడానికి వీలవుతుందని అంటున్నారు.



యాదాద్రి ఆలయ పరిసరాల్లో కిక్కిరిసిన భక్తులు

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. గర్భాలయంలో స్వయంభూలకు నిజాభిషేకం, అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.







సరస్వతీపుత్రుడికి సాయం చేయరూ..

- ఐఐటీ బాంబేలో సీటు సంపాదించిన పేదింటి బిడ్డ
- ఆర్థికసాయం కోసం ఎదురుచూపు


కుంచం శివ

మిర్యాలగూడ: మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన కుంచం శివ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జనరల్ కేటగిరీలో ఆలిండియా 211వ ర్యాంకు, బీసీ కేటగిరీలో 24వ ర్యాంక్ సాధించాడు. శివ చిన్నతనంలోనే అతడి తల్లి చనిపోగా.. తండ్రి నాలుగు సంవత్సరాల క్రితం మృతిచెందారు. శివ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని పలువురు దాతలు అందించిన సహకారంతో 9, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేసి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సంపాదించాడు. కానీ తన ఖర్చుల నిమిత్తం కూడా శివ వద్ద డబ్బులు లేవు. దాతలు సహాయం అందిస్తే, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని తాను కూడా పేదలకు సహాయం చేస్తానని శివ వేడుకుంటున్నాడు.

దాతలు సహాయం అందించాల్సిన వివరాలు

కుంచం శివ
బ్యాంక్ అకౌంట్ నంబర్: 49628100018208
(బ్యాంక్ ఆఫ్ బరోడా)
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: BARB0MIRYAL
ఫోన్ పే నంబర్: 9182871768

విద్యుదాఘాతంతో వలస కార్మికుడు మృతి


చంద్రశేఖర్ మృతదేహం

నకిరేకల్: బతుకుదెరువు కోసం వలస వచ్చిన కార్మికుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలోని సుందరయ్యనగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన నిషాద్ చంద్రశేఖర్(34) అలియాస్ రైఫల్ తన అన్న సుమీర్‌తో కలసి ఇటీవలే నకిరేకల్‌లో పెయింటింగ్ పని కోసం వలస వచ్చారు. సుందరయ్యనగర్‌లో కందాల భద్రారెడ్డికి చెందిన రేకుల షెడ్ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గోరఖ్‌పూర్ నుంచి వచ్చిన 15మందికి పైనే వలస కార్మికులంతా ఇదే షెడ్‌లోని ఐదు రూంల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. నిషాద్ చంద్రశేఖర్ రోజుమాదిరిగానే ఆదివారం పెయింటింగ్ పనికి వెళ్లి సాయంత్రం రూంకు వచ్చాడు. తన దుస్తులు ఉతికి దండెం తీగపై ఆరేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడ ఉన్న మిగతా వారు కర్రతో కొట్టి నిషాద్ చంద్రశేఖర్‌ను పక్కకు తప్పించారు. అపస్మారసక స్థితిలో పడి ఉన్న చంద్రశేఖర్‌ను నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు చంద్రశేఖర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారంతా గోరఖ్‌పూర్‌లో ఉంటున్నారు. చంద్రశేఖర్ మృతిచెందిన సమాచారం వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు.







